చరమసంధ్య

పైడిశ్రీ

యాభై రెండేళ్ల శరీరాన్ని బలవంతాన లాక్కుంటూ వస్తున్న పంచనాదం మేష్టారు అక్కడికి రాగానే మరింత నీరసపడిపోయేరు ఇంకో అరమైలు నడిస్తేగాని యిల్లు రాదు ఎప్పుడో ఉదయం భార్య పట్టించిన మూడు యిడ్లీ ముక్కలు కాసిని కషాయం లాటి కాఫీ నీళ్లతో యింతసేపు జీవుణ్ని నెట్టేడు

కాళ్లలో శక్తి సన్నగిల్లుతూ సన్నటి తీపులు నరాల్లోంచి ఉబుకుతోందగా పక్కనే వున్న పకోడీ బడ్డీ దగ్గరకు నడిచేయి వేడి వేడి పకోడీలు నోరూరిస్తున్నాయి అప్రయత్నంగా లాల్చీ జేబులోకి వెళ్లిన చేతికి కాసిని చిల్లర నాణాలు తగిలేయి బైటికి తీసి లెక్కెట్టాడు

ఎనభై అయిదు పైసలు

అందులోంచి ఓ పావలా బిళ్ల తీసి జేబులో వేసుకుని మిగతా అరవై పైసలు బడ్డీ అతని చేతిలో పోసేడు వేడి వేడి పకోడీల పొట్లాం చేతిలోకొచ్చింది ఆ పక్కనే కాలువ వారగా వేసి వున్న బెంచి మీద ఓ ఎక్కి సర్దుకుని తాపీగా పకోడీలు నమిలేసిన తర్వాత చేతిలో మిగిలిన పొట్లం కాగితానికి చేతులు తుడుచుకుని పారెయ్యబోయి లిప్తపాటు ఆగేడు నొసలు దానంతటదే ముడుచుకుంది కళ్లద్దాలు సరుకుని పరీక్షగా చూసేడు

అందులో అక్షరాలను పట్టి పట్టి చదివేడు సందేహంలేదు అవి తన పుస్తకంలోని అక్షరాలే తన కవిత్వాన్ని మెచ్చుకొంటూ రాష్ట్ర ఆస్థాన కవి రాసిన మాటలవి

తన కళ్లను తాను నమ్మలేనట్టు చుట్టూ చూశాడు ఎవరో కుర్రాడు పకోడీలు తింటున్నాడు

అతన్ని పిల్చి అతని చేతికి ఆ కాగితం యిచ్చి చదువు అన్నాడు మేస్టారు మేస్టారి మొహంలో ముసురుకున్న శ్రావణ జలధరాల్ని గమనించి ఆ గొంతుకలో పలికిన గీరను అర్థం కాకపోయినా ఆ కుర్రాడు చదవడం మొదలెట్టాడు

కవిగారు యిందులో ఒకానొక చరమ సంధ్య ను మన కళ్ల ముందుంచారు ఇది మానవుడి మస్తిష్కాన్ని కమ్మేసిన తమో పటలానికి చరమసంధ్య మానవ మనుగడలో చోటు చేసుకున్న కుల మతాల కుళ్ళు పోరాటాలకు ప్రాంతీయ తత్వాల పరవళ్లకి అధికార దాహాల అనంత యాత్రకి ఆధునికత పేరుతో మనిషి మనో గగనంలో ఉదయించిన అవినీతి సూర్యుడికి ఇది చరమసంధ్య

నేను నిస్సంకోచంగా చెబుతున్నాను దశాబ్దాల తరబడి సంకెళ్లలో చిక్కుకు పోయి చావు వేదన అనుభవిస్తున్న జీవ కవిత పంచనాదంగారి అక్షరాల్లో అపూర్వంగా వూపిరి పోసుకుంది

చాలు ! రుద్ధమైన కంఠంతో మెల్లగా అన్నాడు మేస్టారు చదవడం ఆపేసి ఆ కాగితాన్ని మేస్టారి చేతిలో పెట్టి ఆ కుర్రాడు మళ్ళీ పకోడీలు తినడంలో మునిగిపోయేడు

గుండె తుత్తునియలయి పోతోంది కందరాల్లోంచి అగ్ని పర్వతపు పొగలు స్రవిస్తున్నాయి కళ్లలోంచి లావా చిమ్ముతోంది నోరు తెరిస్తే దుఃఖం కట్టలు తెంచుకుంటుందేమోనని భయం వేసింది కళ్లలోంచి ఉబికే నీళ్లను కళ్లలోనే అదిమిపెడుతూ అతి కష్టంమీద అడిగేడు మేస్టారు బడ్డీ అతన్ని

నాయనా ఈ కాగితం నీకెక్కడిది?

ఎచ్చివాణ్ణి మాసినట్టు చూశాడు ఆ బడ్డీవాడు ఆయన్ని

ఏం? కావాలా పంతులూ కావలిస్తే పట్టుకుపో మధ్య నా వ్యాపారం చెడగొట్టడం ఎందుకు? అన్నాడు విసుగ్గా

అదికాదు ఈ కాగితం నీకెలా వచ్చింది

ఎవరో వేసిపోయారు తూకానికి

ఆ కాగితాలేవో ఒక్క మాటు చూపిస్తావా?

రేపొద్దున రా చూపిస్తాను వేళాకోళంగా అన్నాడు బడ్డీవాడు

కాదు నాయనా శ్రమనుకోకపోతే ఆ తూకానికి వేసిన పుస్తకాలేవో ఒక్కమాటు చూపించు

ఆహా అవతలి కెళ్లవయ్యా ఏంది నీ నస మొహమంతా చింగిలించుకుంటూ అరిచేడు బడ్డీవాడు అవతల వాడి బేరం చెడిపోతోంది మరి

నిశ్శబ్దంగా నిలబడి కాస్సేపు చూసేడు పంచనాదం

చరమసంధ్య కవితా సంపుటి చిత్ర విచిత్రంగా చింపివెయ్యబడింది ఓసారి సగం పేజీ ఓసారి పూర్తి పేజీ మరో సారి రెండు కాగితాలు పకోడీలు చకచకా అమ్ముడుపోతోంటే వాటిని పొట్లాలు కట్టడానికి ఆ కవిత్వం పుస్తకం తన శరీరాన్ని నలగ్గొట్టుకుంది

ఆ దృశ్యాన్ని చూస్తుంటే తన కన్నబిడ్డను తన కళ్ల ముందే నగ్నంగా నిలబెట్టి రాక్షసుడెవరో మానభంగం చేస్తున్నట్టుగా విలవిల్లాడిపోయేడు పంచనాదం మేస్టారు

అవును! ఆ పుస్తకం రాసింది ఆయనే

ఒక బిడ్డను ప్రసవించడానికి ఓ తల్లి ఎంత మదనం ఎంత నరకం అనుభవిస్తుందో ఎన్ని మధురోహలతో తన ప్రాణాన్ని పణంగా పెట్టి మరో జీవితానికి జీవం పోస్తుందో అంతకన్నా ఎక్కువ మదనం అనుభవించాడు అంతకన్నా మేలి మేలి మధురోహలతో మనస్సు నింపుకున్నాడు ఆనాడు

ఆ వ్రాత ప్రతిని అచ్చొత్తించడానికి ఎంత మదనపడ్డాం!

ఎన్ని అనుభవాల్ని ఎదుర్కొన్నాడు!

ఆలోచించుకుంటూ అక్కణ్ణుంచి కదిలేడు పంచనాదం మేస్టారు

పుస్తకం అచ్చొత్తించడానికి అకాడమీ సహాయం అర్థించేడు ఉత్తరం ద్వారా జవాబు లేదు హైదరాబాదు వచ్చి ఆఫీసు చుట్టూ కుక్క తిరుగుళ్ళు తిరిగే ఓపికలేదు రికమండేషన్లు చేయడానికి తనకెవరూ లేరు అందుకే ఆ ఆశ వదులుకున్నాడు ఎవరో ఫలానా పబ్లిషర్ దగ్గరికి వెళ్లమని ఓ ఉచిత సలహా పారేస్తే ఆ పబ్లిషర్ దగ్గరకెళ్లాడు

ఇప్పుడు కవిత్వాన్ని అచ్చెయ్యట్లేదు పంతులూ ఓపికుంటే కాస్తంత సైన్సు ఫిక్షన్ క్షుద్రం చిటికెడంత సెక్సు మిళాయించి ఓ నవల రాయి పదో పరకో యిచ్చుకుంటాను అన్నాడు పబ్లిషరు

పంచనాదంగారు స్థాణువైపోయేరు

ఏం బాబూ కవిత్వం అంత చేదయిందా మీకూ?

చేదూ కాదు విషంకాదూ మీ బోటి రాతలోళ్ళు రాసింది అచ్చేసి నాలుగు రాళ్ళు సంపాదించాలని ప్రారంభించిన బిజినెస్సిది అదుగో ఆ రేక్‌లో చూడండి తెలుగు కవితా చరిత్రలో ఉద్దండ పిండాల్లాంటి కవులు రాసిన పుస్తకాలు ప్రస్తుతం వాటికి పట్టిన బూజుకూడా దులిపే ఓపిక లేదు మాకు ఇలా చూడండి యీ గుట్టకేసి ఇప్పటి నవలలు పొద్దున పేర్చిన గుట్ట యిప్పటికి సగం అయిపోయింది సాయంత్రం కొట్టు కట్టేసేసరికి ఆ కాస్తా అయిపోతుంది ఓపికుంటే ఏదన్నా నవల రాయి

నా వల్ల కాదు

పోనీ సెక్సు పుస్తకాలయినా రాయి

శివ శివా అనుకుంటూ చెవులు మూసుకున్నాడు పంచనాదం మేస్టారు

అక్కణ్ణుంచి వస్తూ వస్తూ బూజుపట్టి వున్న కవిత్వం పుస్తకాల రేక్‌కేసి చూసేడు

కాటుక కంటి నీరు చను కట్టు పయిం పద్యం గుర్తొచ్చింది

ఇంటికొచ్చేడు ఆ సంగతి తనని కలిసిన ప్రతి సాహితీప్రియుడికి చెబుతూ వచ్చేడు వాళ్లలో ఒకాయన ముందుకొచ్చాడు

నేన్ని పుస్తకం అచ్చేయిస్తా పంతులూ అయితే చిన్న షరతు దాన్ని చచ్చిపోయిన మా

ముత్తాతకి అంకితం యివ్వాలి పుస్తకం మీద హక్కులన్నీ నాకేయిచ్చేయాలి అన్నాడు

దానిమీద డబ్బు సంపాదించాలన్న తపన లేదు నాకు అది అచ్చయి పదిమంది ముందూ నిలవాలన్నదే నా కోరిక అని వ్రాత ప్రతి అతని చేతిలో పెట్టేడు రెండు నెలలకల్లా చరమసంధ్య

అందంగా ముస్తాబయింది

ఆవిష్కరణ మహోత్సవం

స్థానికులు ప్రక్క ఊళ్లలో వున్న రసపిపాసులు ఎందరో వచ్చారు అప్పటి ఆస్థాన కవి ఆనాటి సభకు అధ్యక్షతవహించారు ఎందరో కవులు విమర్శకులు ప్రశంసించారు విమర్శించారు పుస్తకంలోని ఒక్కో పంక్తిని తీసుకుని ఒక్కొక్కళ్ళు అర్ధ గంటసేపు మాట్లాడారు

తెలుగు కవిత్వపు పోకడ మీ చేతి వేళ్లలో మరో మలుపు తిరిగింది మేస్టారూ అన్నారు

తెలుగు కవిత్వానికి మరో పట్టుగొమ్మ దొరికింది

అన్నారు

ఇంకా రకరకాలుగా తనని పొగిడారు తన కవిత్వాన్ని తన ఎదుటే పాడి వినిపించారు

ఆనాటి సంతోషాన్ని భరించలేక గుండెలు అల్లల్లాడాయి

తన కవిత్వానికి ఎలాంటి అవార్డులు పురస్కారాలురాకపోయినానూటికి పధిమందయినా చదివితే చాలనుకున్నాడు కనీసం చదివినా చదవకపోయినా తమ తమ పుస్తకాల వరుసల్లో ఈ పుస్తకాన్ని కూడా గౌరవిస్తారని తలపోశాడు

తన తలపోత తప్పు

ఏ మహానుభావుడో తన పుస్తకాన్ని ఓ పకోడీ కొట్లో తూకానికి వేసి దానికి తాను అనుకోనంత గౌరవాన్ని ఆపాదించేడు ఆ మహానుభావుడు కనిపిస్తే

ఏం నాయనా ఆ బడ్డీవాడిచ్చే అర్ధణా బేడకి ఎరచేయడానికి నా కవిత్వమే దొరికిందా అని నిలదియాలని వుంది కానీ తను నిల్చోడానికి సభ్య ప్రపంచంలో చోటులేదు మరొకణ్ని పట్టుకు నిలదీయడమా?

ఆలోచనల్లోనే ఇంటికి చేరుకున్నాడు పంచనాదంగారు పకోడి పొట్లం కాగితం చేతిలో అలానే ఉంది

ఆ చెయ్యి వణుకుతూ ఉంది

ఏమిటి దిగాలుగా ఉన్నారు రాగానే అడిగింది భారతమ్మ మౌనంగా గోడకేసి చూస్తుండిపోయేరు మేస్టారు

ఏమయిందంటే ఏమి చెప్పనే!

చేతిలో కాగితం మరోసారి చూసుకున్నాడు కొత్తగా

ఇంట్లో యింతమంది వుండగా తమరొక్కరే కూర్చుని మిఠాయి బూంది బొక్కి వస్తున్నారా? పైగా ఆ కాగితాన్ని కూడా ప్రత్యేకంగా చూపిస్తూ ఏమిటి మీ వేళాకోళం ఎప్పటి మాదిరే తన గడుసుదనం ప్రదర్శించిందామె

భారతీ! రుద్ధ కంఠంతో పిల్చేడు మేస్టారు సామాన్ల గదిలో అటక మీద అట్ట పెట్టి వుంది దాన్ని కాస్త క్రిందికి దింపు

ఉలిక్కిపడింది భారతమ్మ

ఎందుకు?

అందులో నా చరమసంధ్య పుస్తకం వుంది దాన్నోసారి చూడాలి

ఇప్పుడే చూడాలా?

ఏం అలా అడుగుతున్నావ్

ఏంలేదు ఊరికేనే

ఏ అట్టపెట్టి తాతయ్యా అంటూ వచ్చేడు మాస్టారి మనవడు

వివరంగా చెప్పేడాయన

అదా అది నిన్న నేను తసుకెళ్లి తూకానికి అమ్మేసుకు వచ్చానుగా ఇంకెక్కడుంది!

ఆ మాట వినగానే మాస్టారి గుండెలు క్షణంలో పద్మట్లు విలవిలలాడేయి ఒక్క వూపున కుర్చీలోంచి లేచాడు

ఏమిట్రా నువ్వు చెప్పేది అంటూ గుద్దురిమేడు

అదే ఆ పుస్తకాలున్న అట్టపెట్టి గురించే

ఏం భారతీ నిజమేనా విడు చెప్పేది?

అవునన్నట్లు తల వూపిందామె బెరుగ్గా

అంతటి దిక్కుమాలిన అవసరమేమొచ్చింది దాదాపు అరిచేడాయన అదుపు తప్పిన కోపంతో

వచ్చిన కాసిని డబ్బులు అప్పులవాళ్ల మొహానపోసేశాం ఎనాటికా నాడు ఎగదుడుపు దిగదుడుపు అన్నట్లుయింది సంసారం

ఉపోద్ఘాతాలు అక్కర్లేదు అసలు విషయం

ఏడుపే?

నిన్న సాయంత్రానికి బియ్యం లేకపోతే వృదాగా అటకమీద పడున్నదేగా అని ఆ పుస్తకాలను నేనే తూకానికి అమ్ముకురమ్మని చెప్పాను పొద్దున మీ జేబులో ఖర్చులకిచ్చింది ఆ డబ్బులే

ఆ మాటలు ఎడుగుల్లా ఆయన చెవుల్లో దూరి ఒక్కో జీవాణువుని వెదికి మరి కుళ్లబొడిచేస్తోంటే నిస్సత్తువుగా నిస్తేజంగా నిర్జీవుడిలా కుర్చీలో కూలబడిపోయేరు పంచనాదం మేస్టారు

ఆటవెలదులు తేట గీతులు ఉత్పలమాలలు చంపకమాలలు పేర్చి కవిత్వానికి కాలం కట్టిన పాడెమీద కాటికేసి తరలిపోతోంది ఓ కిరణం శార్దూలాలు మత్తేభాలు దాని వెంట గుండెలు చరుచుకుంటూ అరుచుకుంటూ అంగలార్చుకుంటూ ! □